క్లుప్తంగా

గంగాలమ్మ సేవలో మున్సిపల్ చైర్‌పర్సన్



గంగాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

మునగపాక: మండలంలోని మూలపేటలోని గంగాలమ్మతల్లిని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా గతంలో విశాఖ డెయిరీ ద్వారా పెయింటింగ్ నిమిత్తం రూ.3 లక్షల మేర సాయం అందించిన నేపథ్యంలో ఆమెను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, జోనల్ మేనేజర్ శరగడం రమణ, పాల సంఘం మాజీ అధ్యక్షులు శరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, పెద్దలు యల్లపు రాజేశ్వరరావు, భీశెట్టి నాగేశ్వరరావు, ఆడారి సత్యనారాయణ, యల్లపు నాగేశ్వరరావు వీరునాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘ అధ్యక్షుడిగా శివ



నూతన కార్యవర్గం

మునగపాక: దళితవాడ అంబేడ్కర్ యువజన సేవా సంఘ అధ్యక్షునిగా దిమ్మల శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రామాలయంలో పెద్దల సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా శివ, ఉపాధ్యక్షునిగా మురళీకృష్ణ, కార్యదర్శిగా తట్టా అశోక్‌కుమార్, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి అనిల్ కుమార్, కోశాధికారిగా మైలపల్లి నారాయణ, సభ్యులుగా కారు వినోద్, బీలా అప్పలనాయుడు, తెరపల్లి ప్రసాద్, మైలపల్లి మహేష్, జంపా సీతారామ్, మార్లపల్లి రామకృష్ణ, ప్రచార విభాగం ప్రతినిధిగా మాటూరి మహేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు.

మరిడిమాంబ ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న సాధన సంస్థ అధ్యక్షుడు ఇస్మాయిల్

మునగపాక: మండలంలోని తోటాడ-గవర్ల అనకాపల్లి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి భక్తులు తమవంతుగా విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సాధన సంస్థ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ ఆదివారం రూ.20 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న పాత్రికేయులు

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా జర్నలిస్టుల సంక్షేమం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పత్రికా వ్యవస్థపై దాడులపై యూనియన్ రాజీలేని పోరాటం చేస్తోందని ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచంట రామకృష్ణ, దాసరి శ్రీనివాస్ పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడియేషన్లు ఇవ్వాలని యూనియన్ ప్రభుత్వాలతో పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు జీవీ ప్రసాద్‌బాబు, పల్లా ప్రసాద్, జీవీ ప్రసాద్, వెలగా ప్రసాద్, నాగార్జున, రాము, నానాజీ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో క్రిమిసంహారక మందు తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ రమణమ్మ ఆదివారం తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా వారం రోజుల క్రితం వియ్యపు రాజేశ్వరి (26) ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఆమెను అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చినుకు పడితే జలమయం



పూడిక తీయకపోవడంతో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు





మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు



వర్షం నీటితో మునిగిపోతున్న నివాస ప్రాంతం

పాయకరావుపేట: చిన్నపాటి వర్షానికే పట్టణంలో రోడ్లు జలమయంగా మారుతున్నాయి. ఇక పెద్ద వర్షం కురిస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రధాన డ్రైనేజీ మురుగుతోపాటు వర్షం నీరు సక్రమంగా పారడం లేదు. దాంతో వర్షం నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోతోంది. పట్టణంలో మెయిన్‌రోడ్డును ఆనుకున్న ప్రధాన డ్రైనేజీ ద్వారా మురుగు పంట కాలువల్లోకి వెళ్తుంది. పట్టణంలో నడిబొడ్డున నేరెళ్ల కాలువ ద్వారా సాగునీరుతోపాటు డ్రైనేజీ మురుగు పారుతుండాలి. నేరెళ్ల కాలువ ఆక్రమణలకు గురికావడంతోపాటు పూడికతీత తీయకపోవడం వల్ల ప్రధాన డ్రైనేజీ మురుగు ముందుకు వెళ్లే అవకాశం లేక రోడ్ల పైకి చేరుతోంది.

పూడికతీతకు నోచని డ్రైనేజీలు

పలుచోట్ల డ్రైనేజీలు పూడికతీతకు నోచుకోకపోవడం వల్ల డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నేరెళ్ల కాలువ ద్వారా పట్టణంలో ప్రధాన డ్రైనేజీ మురుగు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ అధికారి కుమారస్వామిని సంప్రదించగా డ్రైనేజీ నీరు రోడ్లపై నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీతలు ఎప్పటికప్పుడు తీస్తున్నామన్నారు.

ముంపునకు గురవుతున్న కాలనీలు

పట్టణంలో లక్ష్మీథియేటర్ వద్ద వర్షం పడితే నీరు రోడ్డుపైనే ఉండిపోతోంది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షం నీరు పోవడానికి కొన్ని గంటల సమయం పడుతుంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా వర్షం పడితే కంటోన్మెంట్‌లో రోడ్లు నీట ముంపునకు గురవుతున్నాయి. దీంతో కంటోన్మెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ అంబేడ్కర్, దుర్గాకాలనీలకు వెళ్లే మార్గం వర్షం పడితే చెరువుల్ని తలపిస్తోంది. వర్షం పడితే సమీప కొండల నుంచి నీరు కిందకి పారడం, జాతీయ రహదారికి సంబంధించిన బ్రిడ్జిపై నుంచి వర్షం నీరు కాలనీలోకి రావడం వల్ల కాలనీలో నివాస ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయి. దీంతో అంబేడ్కర్, దుర్గాకాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్లపైకి మురుగు నీరు



డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదు. రోడ్లపైకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. ఎంతో ఇబ్బందికరంగా ఉంది. డ్రైనేజీ సమస్యను పంచాయతీ అధికారులు పరిష్కరించాలని కోరుతున్నాను.

– ఆడారి నూకరాజు, పాయకరావుపేట

65 వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు



ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైనట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. మండలానికి 65 మరుగుదొడ్లు మంజూరు కాగా, ఒక్కొక్క దానికి రూ.15 వేలు చొప్పున నిధులు అందజేస్తారని తెలిపారు. పందూరు, పాములవాక, జల్లూరు, కోటవురట్ల, జల్లూరు, చౌడువాడ, సుంకపూరు, నీలిగుంట, రాజుపేట, కైలాసపట్నం, బోడపాలెం, కె.వెంకటాపురం, కైలాసపట్నం, టి.జగ్గంపేట గ్రామాలకు వీటిని కేటాయించినట్టు తెలిపారు. మరుగుదొడ్లు లేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన పోటీల్లో విద్యార్థినులు

అచ్యుతాపురం రూరల్: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తిలో ప్రదర్శించిన నృత్య పోటీల్లో అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి సభ్యులు రమణ, కృష్ణకుమారి ఆధ్వర్యంలో వీరు నృత్య ప్రదర్శన చేశారు. రాష్ట్రంలో 25 వేల మంది నృత్య కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు పి.ఎస్.టి.పట్నాయక్ ఆదివారం తెలిపారు. విద్యార్థినులు మానస, దేవిక, రేష్మ, కనకమహాలక్ష్మి, స్మయిత, ప్రణయ్‌లను ఆయన అభినందించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పూర్వ ప్రిన్సిపాల్ షరీఫ్

కోటవురట్ల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం పులకించింది. విద్యార్థుల పలకరింపులను పరవశంగా ఆలకించింది. 1991-92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే చదువులమ్మ తల్లి చెంత కలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడి ఒత్తిళ్ల మధ్య యాంత్రిక జీవనం గడుపుతున్న వారంతా ఆనాటి మధుర స్మృతులు గుర్తుకురాగా చిన్నపిల్లల్లా మారిపోయారు. మనసంతా సంతోషంతో వెలిగిపోయిన ముఖాలతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎక్కడ ఉన్నారు, ఎలా ఉన్నారు, పిల్లలు ఏం చదువుతున్నావంటూ ముచ్చట్లు చెప్పుకున్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా, మళ్లీ మళ్లీ కలుసుకుందామంటూ ఒట్టేసుకున్నారు. ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత జీవితాలకు మార్గాన్ని ఇచ్చిన ఆనాటి ప్రిన్సిపాల్ షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని తమ సొంత నిధులతో ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్‌తో కలిసి ఆవిష్కరించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



ఎమ్మెల్యే కప్ టీ-షర్టులను అందజేస్తున్న కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకుటి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం సందర్భంగా జరిగే ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఇందుకు సంబంధించిన టీ షర్టులను ఆయన అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయన్నారు. వర్షం వల్ల పోటీలకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు దొడ్డి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నూకాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ట



ప్రతిష్ట విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఎస్.రాయవరం: దార్లపూడిలో మరిడిమాంబ ఆలయంలో నందీశ్వరిని విగ్రహం ప్రతిష్ఠించారు. తొలుత ప్రతిష్ట విగ్రహాలకు భారీ ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఆలయాల అభివృద్ధి పనుల్లో భాగంగా మరిడిమాంబ ఆలయం, రామాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠ చేపట్టారు. అమలాపురం మండలం బట్నవిల్లికి చెందిన చంద్రమౌళి భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. రామాలయంలో సోమవారం తెల్లవారుజామున సిద్ధివినాయకుడు, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల నియామకం

నాతవరం: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను నియమించారు, దీనికి సంబంధించి సంఘాలు వారీగా అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. మండల బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా వేముల నాగ వెంకట సూరిబాబు, మండల క్రిస్టియన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా కాకర సింహాచలం మండల కల్చరల్ కమిటీ అధ్యక్షుడిగా పైల మణేంద్ర, మండల దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మామిడి రాజుబాబు, మహిళా విభాగం మండల శాఖ అధ్యక్షురాలిగా ఇనపసప్పల పుష్ప, మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మిరపల వెంకటరమణ, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా రెడ్డి సత్యనారాయణ, మండల సమాచార హక్కు (ఆర్‌టీ) విభాగం కమిటీ అధ్యక్షుడిగా కోసూరి వరహా పైడిరాజు(బుచ్చి), మండల రైతు విభాగం కమిటీ అధ్యక్షుడిగా అంకంరెడ్డి రాజుబాబు, మండల ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు సత్యనారాయణ, మండల సోషల్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా కర్రి వెంకటరమణ, మండల ఎస్టీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా కూడా శ్రీను, మండల విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షుడిగా పుణ్యమంతుల స్వామి, మండల యూత్ విభాగం అధ్యక్షుడిగా బండారు పైడన్ననాయుడు, మండల వీవర్స్ విభాగం కమిటీ అధ్యక్షుడిగా పడాల లక్ష్మినర్సింహరావు, మండల వలంటీర్ల విభాగం కమిటీ అధ్యక్షుడిగా సిద్దాబత్తుల వెంకటరమణ, మండల వాణిజ్య విభాగవ కమిటీ అధ్యక్షుడిగా గ్రంధి జగన్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. అధ్యక్షులతో పాటు కమిటీలో ఉపాధ్యక్షులు, జాయింట్ కార్యదర్శులు, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, కమిటీకి 18 మంది సభ్యులు చొప్పున ప్రతి కమిటీ నియమించారు.

ఉప్పొంగిన శారదా నది



కశింకోట: ఎడతెరిపిలేని వర్షానికి స్థానిక శారదా నది ఉప్పొంగి ప్రవహించింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల నదిలో వరద నీరు చేరి ప్రవహిస్తోంది. పంట భూములకు నది నుంచి గ్రోయిన్ల ద్వారా సాగు నీరు మెరుగు పడగలదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

- స్తంభించిన జనజీవనం
- రోడ్లన్నీ బురదమయం



మునగపాకలో కురుస్తున్న వర్షం



పెదబోదిగల్లం వెళ్లు రోడ్లో వర్షపునీరుతో బురద

నక్కపల్లి: మండలంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఉదయం నుంచి రాత్రివరకు జోరున వర్షం పడటంతో చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు వరదలా ప్రవహించింది. ఈ వర్షం వరినాట్లకు మేలు కలిగించింది. రెండు రోజుల నుంచి అడపా దడపా పడుతున్నప్పటికీ ఆదివారం మాత్రం విరామం లేకుండా కురవడంతో బయట కాలుపెట్టలేని పరిస్థితి నెలకొంది. వరి పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. ఇక గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై వర్షపునీరు భారీగా చేరడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా పోలవరం కాలువకు అవతల ఉన్న సీతంపాలెం, పెద దొడ్డిగల్లు, సీతానగరం, చీడిక కొత్తూరు, చీడిక, తదిత గ్రామాలకు వెళ్లే వారు నరక యాతన పడ్డారు. కాలువ తవ్వకాల్లో ఈ గ్రామాలకు వెళ్లే రోడ్లను మధ్యలో తవ్వేసారు. ప్రత్యామ్నాయంగా గ్రావెల్‌తో అప్రోచ్ రోడ్లు నిర్మించకుండా కాలువ తవ్వగా వచ్చిన మట్టితోనే తాత్కాలికంగా రోడ్డు నిర్మించారు. దీంతో వర్షాలు పడిన సమయంలో ఈ రోడ్లన్నీ మోకాలు లోతు నీటితో బురదమయంగా మారాయి. నడిచి వెళ్లే వారు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆటోలయితే ఈ గ్రామాలకు రావడం లేదు. ఆదివారం పాఠశాలలకు సెలవు కావడంతో విద్యార్థులకు పర్వాలేదు. సోమవారం ఆయా గ్రామాల నుంచి గొడిచర్ల, పెదబోదిగల్లం పాఠశాలలకు రావడానికి చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విరామం లేకుండా వర్షాలు పడితే పాఠశాలలకు డుమ్మాకొట్టాల్సిందేనంటూ చెప్పుకొస్తున్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు వర్షాలు కారణంగా ఇబ్బందులు పడ్డారు. నక్కపల్లి ఆస్పత్రి ప్రాంగణం, మండల కాంప్లెక్స్, ఉపమాకలో ఆలయ ప్రాంగణాలు, ఎన్.నర్సాపురం వెళ్లే రోడ్లు డి.ఎల్.పురం, ఉపమాక నుంచి జానకయ్యపేట వెళ్ల రోడ్డు, రేబాక, రమణయ్యపేట, వేంపాడు నుంచి అమలాపురం, నెల్లిపూడి రోడ్లు జలమయమయ్యాయి. ఈ రోడ్లలో పెద్ద పెద్ద గోతులు ఉండటంతో వర్షపునీరు గోతుల్లో చేరి ప్రమాదకరంగా మారాయని పాదచారులు వాపోతున్నారు.



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షం



రాజుపేటలో రోడ్డు మధ్యగా పారుతున్న వర్షపునీరు

రోజంతా కుండపోత వర్షం

కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు, పంట కాలువలు, పొలాలు వర్షం నీటితో నిండిపోయాయి. యండపల్లి శివారు, కైలాసపట్నం, జల్లూరు, కోటవురట్ల మెయిన్‌రోడ్డులో భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. తెరిపివ్వకుండా కురవడంతో జనజీవనం స్తంభించింది.

వర్షంతో ఇబ్బందులు

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారు నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఇంతకాలం వరుణుడు కోసం ఎదురు చూసిన రైతులకు ఈ వర్షం నష్టాన్ని కలగజేస్తుంది. ఒకవైపు ఇప్పటికే ఆకుమడులు వేయగా, మరికొన్ని చోట్ల ఉడుపులు ప్రారంభించారు. ఈ వర్షంతో ఆకుమడులు మునిగిపోయాయంటూ రైతులు వాపోతున్నారు. వ్యవసాయ దుక్కులు చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్.రాయవరం: మండలంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయయ్యాయి. బంగారమ్మపాలెంలో వీధి రోడ్లపై మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయి గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో మోస్తరు వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోయే పరిస్థితి ఉంది. భారీ వర్షం కురవడంతో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోయింది. కొరుప్రోలు వైఎస్సార్ కాలనీకి వెళ్లే రోడ్డుపై, అడ్డురోడ్డు మెయిన్‌రోడ్డు, ధర్మవరం అగ్రహారం, సైతారుపేట, సర్వసిద్ధి, పెదగుమ్ములూరు శివాలయం రోడ్డు, చినగుమ్ములూరు తదితర గ్రామాల్లో రోడ్లన్నీ జలమయయ్యాయి.



బంగారమ్మపాలెం రోడ్డుపై వర్షం నీరు



వరి పొలాల్లో చేరిన వర్షపునీరు



భారీ వర్షం కారణంగా లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ చిట్టినాయుడు

సబ్బవరం: ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో పాడి రైతులంతా తమ పశువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. ఆరిపాక పంచాయతీ చినయాతపాలెంలో పాడి రైతులకు పలు సూచనలు చేశారు. పాడుబడిన పశువులశాలలో పాడి పశువులను ఉంచవద్దన్నారు. పశువుల కొట్టాల్లో వాటిని తాళ్లతో కట్టవద్దని సూచించారు. నీరు ఎక్కువగా ఉండే గుంటలు, చెరువులు, జలాశయాల వద్దకు తీసుకెళ్లవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉంచాలని, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తుఫాన్ సమయంలో మరణించినట్లైతే 24 గంటల్లో దగ్గర్లోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌కు లేదా పశు వైద్యశాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సేవలందించేందుకు మండలంలోని పశువైద్య సిబ్బందితో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్: 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com